

మేడే, జాతీయ సమ్మెను విజయవంతం చేయాలి

తణుకు:మేలో జరిగే మేడే, మే 20న జరిగే జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక అమరవీరుల భవనంలో జరిగిన సిఐటియు మండల విస్తృత సమావేశం సిఐటియు నాయకులు ఉండ్రాజవరపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపి మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమలు చేస్తే కార్మికులు బానిసలుగా మారడం ఖాయమన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కుల జోలికి ఎవరు వచ్చినా సహించరన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికులను శ్రమ దోపిడీ చేసి కార్పొరేట్లకు దోచి పెడుతోందని విమర్శించారు. మే 20న కార్మికుల సత్తా ఏంటో మోడీకి చూపించాలన్నారు. అనంతరం లేబర్ కోడ్స్‌పై సిఐటియు వేసిన బుక్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వల్లూరి వెంకటేశ్వరరావు, అజయకుమారి, పిడి.మూర్తి, గార రంగారావు, రమేష్, రామకృష్ణ, అయ్యప్ప, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

నిరుపేదలపై.. నియంత పాలన

- పేదల పొట్ట కొట్టి భూస్వాములకు పెట్టడమేనా పి-4 అంటే
- విధ్వంసం, అరాచక పాలనలో కలెక్టర్, ఎస్‌పి మిగిలిన అధికారులకూ భాగస్వామ్యం
- నెల రోజుల్లో కూల్చిన ఇళ్లను పునఃనిర్మించాలి
- భూస్వాముల ఆధీనంలోని భూములు పేదలకు పంచాలి
- లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉండి ఎంఎల్‌ఎ భాగోతాన్ని బయట పెడతాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- పాలకోడేరు ఎస్‌ఆర్ నగర్ వాసులకు సిపిఎం రాష్ట్ర నేతల పరామర్శ
- మగ పోలీసులు ఎక్కడ పడితే అక్కడ తాకి కొట్టారంటూ రోదించిన మహిళలు



నేతలకు తమ కష్టాన్ని చెప్పుకుంటున్న మహిళలు

ప్రజాశక్తి - భీమవరం

ఉండి నియోజకవర్గంలో రాక్షస రారాజు రాజ్యం (ఆర్‌ఆర్‌ఆర్) రాజ్యమేలుతుందని, నిరుపేదలపై నియంత పాలన జులుం విదిల్చుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. నియోజకవర్గంలో మూడు నెల కాలంలో వెయ్యి మంది నిరుపేదల ఇళ్లను అత్యంత కిరాతకంగా కూల్చేయడం అన్యాయమన్నారు. విధ్వంసం, అరాచక పాలనలో జిల్లా కలెక్టర్, ఎస్‌పితోపాటు మిగిలిన అధికారులు భూస్వాములుగా ఉన్నారని ఆరోపించారు. నెల రోజుల సమయంలో కూల్చిన చోటే పేదల ఇళ్లు పునఃనిర్మించడంతోపాటు భూస్వాముల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం, ఎంఎల్‌ఎ భాగోతాన్ని బయట పెడతామని హెచ్చరించారు. పాలకోడేరు ఎస్‌ఆర్ నగర్‌లో సిపిఎం రాష్ట్ర బృందం మంగళవారం పర్యటించింది. కూల్చేసిన ఇళ్లను పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు తమ ఆవేదనలో సాగిన దౌర్జన్యకాండ వివరాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు వివరించి కన్నీటి పర్యంతమయ్యారు. తన ఇద్దరు కుమార్తెలకు అంగవైకల్యం ఉందని, ఈ ఇల్లు తప్ప వేరే ఆధారం లేదని గుడాల లక్ష్మి భోరున విలపించింది. తనకు ఇద్దరు ఆడపిల్లలేనని, ఉన్న ఇంటిని నిర్దాక్షిణ్యంగా కూల్చేయడంతో వేరే వాళ్ల ఇంటి ఆవరణలో ఉయ్యాల కట్టి దానిలో చంటి బిడ్డను ఉంచానని బచ్చిక పార్వతి కన్నీరుమున్నీరైంది. మరో రెండు రోజుల్లో మీ ఇంటిని తొలగిస్తున్నామని నోటీసులివ్వడానికి విఆర్‌ఒ, పంచాయతీ కార్యదర్శి వచ్చారని, ఇంటి ఆవరణలో కూరగాయలు కోస్తున్న తన భార్య లక్ష్మి అధికారులు చెప్పిన మాట విని స్పృహ తప్పి పడిపోయి మృతి చెందిందని భర్త మెట్ల లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత మహిళలు ఈశ్వరి, అన్నపూర్ణ, వెంకటలక్ష్మి, బుల్లెమ్మ, పార్వతి, సావిత్రి, భారతి, సత్యవతి, చిన్నమ్మ మాట్లాడుతూ మగ పోలీసులు ఎక్కడబడితే అక్కడ చేతులు వేసి కొట్టారని వాపోయారు. ఇంట్లో సామాన్లు తీసుకుంటామన్నా వినకుండా మీ దిక్కున చోట చెప్పుకోండని పోలీసులు దౌర్జన్యం చేసి ఇళ్లు కూలగొట్టారన్నారు. ఈ శిథిలాల మధ్యనే పాముల భయంతో రాత్రుళ్లు నిద్ర లేకుండా గడుపుతున్నామని చెప్పారు. విద్యుత్ సౌకర్యం లేదని, వృద్ధులు చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఎక్కడ వండుకోవాలో, ఎక్కడ పడుకోవాలో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నామని కంటతడి పెట్టారు. ప్రతి ఇంటినీ పరిశీలించి బాధితులను పరామర్శించారు. భూస్వాములు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని, ప్రభుత్వ సర్వే రాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించగా శ్రీనివాసరావు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు వారసుడినని చెప్పుకుంటూ ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు అల్లూరి సీతారామరాజు నగర్‌లో పేదలకు అన్యాయం చేసి అల్లూరికి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. పేదలు, ఒంటరి మహిళలు, వృద్ధులు, బాలింతలపై ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు విధ్వంసానికి పాల్పడ్డారన్నారు. మహిళలను ఎక్కడపడితే అక్కడ తాకి మగ పోలీసులు కొట్టడం సిగ్గుచేటన్నారు. మానవ హక్కుల సంఘాలకు ఈ ఘటనను నివేదిస్తామని,



పోలీసుల దాడిలో గాయాలను చూపుతున్న మహిళ



ఇళ్ల శిథిలాలను పరిశీలిస్తున్న నేతలు

అలాగే కోర్టు ధిక్కరణ కేసు కూడా పెడతామని తెలిపారు. బ్యాంకులకు డబ్బులు ఎగ్గొట్టిన ఉండి ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ఇప్పుడు నీతులు చెబుతున్నారని, ఆ పదవికి ఆయన అనర్హుడని చెప్పారు. భూస్వాముల ఆధీనంలో ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని లేనిపక్షంలో తామే స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామని చెప్పారు. నెల రోజుల్లో కూల్చిన ఇళ్లను పున:నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నేత మంతెన సీతారాం, జిల్లా నేతలు బి.వాసు దేవరావు, జుత్తిగ నరసింహమూర్తి, దూసి కళ్యాణి, మామిడిశెట్టి రామాంజనేయులు, కె.క్రాంతి బాబు, ధనికొండ శ్రీనివాస్, కె.తవిటినాయుడు, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య పాల్గొన్నారు.

పేదలకు భూమి పంచే వరకూ ఉద్యమం..★★★

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

భూస్వాములు చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచకపోతే మరో భూపోరాటానికి సిద్ధమవుతాం. పేదల గుడిసెలు మాత్రమే అధికారులకు, ఎంఎల్‌ఎకు కన్పించాయా, భూస్వాముల చేతుల్లో ఉన్న వందలాది ఎకరాలు మీకు కన్పించవా అని ప్రశ్నించారు. భూస్వామ్య భావజాలంతో రఘురామకృష్ణరాజు అహంకారపూరిత పాలన చేస్తున్నారని, తగిన మూల్యం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ఎంఎల్‌ఎకు ఇళ్లు కూల్చే శాఖ ఏమైనా ఇచ్చారా..★★★

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజుకు ఇల్లు కూల్చేసే మంత్రి పదవి ఏమైనా ఇచ్చారా. లేక లైసెన్సు ఇచ్చారా. పేదల ఇళ్లు కూలుస్తుంటే చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్‌కు కనిపించట్లేదా. లేక వీటిని సమర్థిస్తున్నారా. ప్రజలకు మీరే సమాధానం చెప్పాలి. ఎస్‌ఆర్ నగర్‌లో ఇంత దుర్మార్గం జరుగుతుంటే ఐఎఎస్, ఐపిఎస్‌లు కనీసం స్పందించకపోవడం దారుణం. భూస్వాములు ఎకరాలు ఎకరాలు ఆక్రమించుకుంటే పట్టించుకోరు. నిరుపేద సెంటు భూమిలో గుడిసె నిర్మించుకుంటే తొలగిస్తున్నారు. ఇదేనా న్యాయం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 ఉండి నియోజకవర్గంలో రివర్స్‌లో అమలవుతుంది. సంపన్నుల సహకారంతో పేదలను అభివద్ధి చేయాలని ముఖ్యమంత్రి చెబుతుంటే, ఇక్కడ మాత్రం పేదలను కొట్టి సంపన్నులకు ఆస్తులను కట్టబెడుతున్నారు. అసెంబ్లీ కల్చరల్ ప్రోగ్రాంలో వేసిన దుర్యోధన పాత్రని నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ అమలు చేస్తున్నారు. ఓట్లు కొనుక్కున్నాను.. నా ఇష్టమని చెబుతున్నారు. మరి ఓట్లు అడిగే ముందు ఈ విషయం చెబితే బాగుండును.

జిల్లాలో టిడిపిని భూస్థాపితం చేస్తున్న ఎంఎల్‌ఎ★★★

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

టిడిపి ఆవిర్భావం నుంచి ఉండి నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా ఉంది. పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు మండలాల్లో వందలాది ఇళ్లు దుర్మార్గంగా కూల్చేశారు. టిడిపికి ఓటేసినవారు, టిడిపి సభ్యత్వం పొందినవారు కూడా నష్టపోయారు. తద్వారా టిడిపిని ఆ పార్టీ ఎంఎల్‌ఎనే భూస్థాపితం చేస్తున్నారు. జిల్లాలోని ఎంఎల్‌ఎలు, టిడిపి నేతలు, జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు పట్టించుకోకపోతే టిడిపి పరిస్థితి అధోగతే. పేదల పక్షాన ఎర్రజెండా ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుంది. అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు కలిసొచ్చి పేదలకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ట్రిపుల్ ఆర్ అంటే రాక్షస రారాజు రాజ్యం అని అర్థంగా వ్యవహరిస్తున్నారు.

పేదలపై బ్రహ్మాస్త్రం సరికాదు..★★★

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ

40 ఏళ్ల నుంచి నివాసముంటున్న ఇళ్లను అత్యంత కిరాతకంగా దాడి చేసి తొలగించడం అన్యాయం. ఎంఎల్‌ఎ పేదలపై యుద్ధం చేస్తున్నారు. ఇది సరైంది కాదు. పేదలు ఎలా బతుకుతారో కూడా ఆలోచించకుండా నిర్దాక్షిణ్యంగా ఇళ్లు కూల్చేశారు. ఇంత దుర్మార్గం ఇక్కడ తప్ప ఇంకెక్కడ ఉండదు. సమస్య పరిష్కారమయ్యేంత వరకు బాధితులకు అండగా ఉంటాం. అధైర్య పడకుండా ఐక్యంగా ముందుకు సాగాలి.



బాధితులనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివసరావు

భవ్య భీమవరం అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

భవ్య భీమవరం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నాగరాణి భవ్య భీమవరం సుందరీకరణ, మౌలిక వసతులు అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనుల పురోగతి, ఇంకా చేపట్టాల్సిన పనులపై మున్సిపల్ అధికారులు, దాతలతో సమీక్షించారు. కాస్మో క్లబ్ వద్ద వంశీకృష్ణ పార్కు, ఎఎస్‌ఆర్ నగర్‌పార్కు, అడ్డవంతెన దగ్గర నుండి మున్సిపల్ లిమిట్స్ వరకూ డివైడర్ అభివృద్ధి పనులు, ఆదర్శనగర్ పార్కు, ఆదిత్య కళావేదిక పార్కు, ఓల్డ్ బస్టాండ్, భీమవరం హాస్పిటల్ వద్ద మోడ్రన్ బస్సు షెల్టర్లు, అంబేద్కర్ సర్కిల్ ఆర్‌యుబి కుడివైపు ఖాళీస్థలం అభివద్ధి పనుల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పట్టణ వాసులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన మౌలిక వసతుల ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే హౌసింగ్ బోర్డులోని ఆదిత్య కళా వేదిక అభివృద్ధికి రూ. 9 లక్షలు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఖర్చు చేయడం జరిగిందని, మరో రూ. 11 లక్షల మిగతా పనులకు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, జిల్లా గ్రంథాల అధికారి ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు ఉంచాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి



రైతుసేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి

ప్రజాశక్తి - ఉండి

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన గోనె సంచులను అందుబాటులోనే ఉంచాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం యండగండిలోని రైతుసేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళు సక్రమంగా జరుగుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. తేమ శాతాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. గోనె సంచుల కొరత ఉందని రైతులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా యండగండి సొసైటీ స్టాక్‌ను పరిశీలించారు. సంబంధిత రైస్‌మిల్లర్లతో ఫోన్లో మాట్లాడారు. మిల్లులవారీగా ట్యాగ్ చేసి అవసరమైన రైతులకు 20 వేల గోనె సంచులను అందజేయాలని తహశీల్దార్, సొసైటీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.నాగార్జున, వ్యవసాయాధికారి బి.సంధ్య, ఎంఎల్‌ఒ వర్ధిని, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన బొండాడ పేదలకు స్థలాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

డిఆర్‌ఒకు బాధితులు, సిపిఎం నేతల వినతి



డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

బొండాడలో ఇళ్లు కోల్పోయిన పేదలకు అక్కడే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ కోరారు. స్థానిక కలెక్టరేట్లో బొండాడవాసులకు నివసించే చోటే ఇళ్ల స్థలాలివ్వాలని కోరుతూ డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు సిపిఎం నేతలు, బాధితులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ బొండాడలోని 27 పేద కుటుంబాలను ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు రోడ్డున పడేశారన్నారు. వెంటనే అధికారులు స్పందించి పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం కాళ్ల మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యురాలు దూసి కళ్యాణి, పేదలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 200 రోజులు పని చూపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్




పెనుమంట్ర : కూలీలతో మాట్లాడుతున్న కేతా గోపాలన్

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు ఏడాదిలో కనీసం 200 రోజులు పని దినాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ కోరారు. మంగళవారం మల్లిపూడి గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లుతోపాటు కనీస వసతులు కల్పించాలని కోరారు. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని మండల కార్యదర్శి కోడే శ్రీనివాస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సానబోయిన రత్నకుమారి, పిల్లి వెంకట ఝాన్సీ, సానబోయిన వాసంతి, కేతా లక్ష్మీ తులసి, పితాని వెంకటరమణ, జక్కంశెట్టి భవాని, వేంద్ర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పోడూరు: ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సిపిఎం నేతలు పిల్లి ప్రసాద్, మూడే మోజెస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం మినిమించిలిపాడు గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ కూలీలకు కనీస వేతనం అమలు చేయటం లేదని విమర్శించారు. మేట్లకు పారితోషికం రూ.5 ఇవ్వాలని కోరారు. కూలీలకు 200 రోజులు పని కల్పించి, కనీస కూలీ రూ.600 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



పోడూరు : కూలీలతో మాట్లాడుతున్న నేతలు

కార్యకర్తల సంక్షేమమే టిడిపి లక్ష్యం

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ



ఫిర్యాదుల స్వీకార కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - తణుకు

కార్యకర్తల సంక్షేమమే టిడిపి లక్ష్యమని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం కూటమి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం వద్ద ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇకపై వారానికోసారి కార్యకర్తల సమస్యలు తెలుసుకునేందుకు వారి నుండి వినతులు స్వీకరించడానికి ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై ఎన్నో అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. వైసిపి నాయకుల దౌర్జన్యాలు కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పార్టీ కోసం పని చేసి వారి సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆరోగ్య పరమైన ఇబ్బందులు, పార్టీ సంస్థాగత పదవులు, నామినేటెడ్ పోస్టులు, ఆర్థిక పరమైన సమస్యలు ఇలా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్న వారి నుండి వినతులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం, పార్టీ పరంగా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన కృషి చేస్తామన్నారు. 40 ఏళ్ల గా పార్టీని నమ్ముకుని ఉంటున్న వారిని, ఇప్పటికీ నామినేటెడ్ పోస్టులు రాని వారిని గుర్తించి వారికి పార్టీలో గౌరవ ప్రదమైన స్థానం కల్పించేందుకు కృషి చేస్తానని ఎంఎల్‌ఎ తెలిపారు.


హౌస్ ఫర్ ఆల్ జిఒ అమలు ఎప్పుడు?

సిపిఐ జిల్లా కార్యదర్శి కె.భీమారావు

ప్రజాశక్తి - భీమవరం

హౌస్ ఫర్ ఆల్ అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒ ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని, ఇళ్ల స్థలాల వ్యక్తిగత అర్జీలు డిప్యూటీ తహశీల్దార్ ఇ.నాగార్జునకు అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నేతలు రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఛాన్ భాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలనీలో కమిషనర్ పర్యటన



మాట్లాడుతున్న కమిషనర్ అంజయ్య

ప్రజాశక్తి - నరసాపురం

ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. మంగళవారం రుస్తుంబాద ప్రభుత్వ కాలనీలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను లబ్ధిదారులతో కలిసి అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌టిలకు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.2.55 లక్షలు అందిస్తోందన్నారు. ఇళ్లు నిర్మించుకోదలిచి ముందుకొచ్చిన కొంతమంది యనాదుల లబ్ధిదారులకు వెంటనే వారికి ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలను చూపించి, లోన్ వచ్చే ప్రక్రియను వివరించారు.

బాధితునికి ఆర్థిక సాయం



బాధితునికి డబ్బులు అందజేస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - మొగల్తూరు

ఇటీవల జరిగిన ఘటనలో గాయపడిన ఉపాధి కూలీకి అధికారులు అండగా నిలవడం అభినందనీయమని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరు పంచాయతీ నల్లంవారితోట జాతీయ రహదారి వద్ద వ్యాన్ దూసుకెళ్లిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మొగల్తూరు పంచాయతీ సుబ్రహ్మణ్యేశ్వరానికి చెందిన ఉపాధి కూలీ గుడాల వీర వెంకట సత్యనారాయణకు ప్రభుత్వ ఉద్యోగులు బాసటగా నిలిచారు. సత్యనారాయణ వైద్య అవసరాలు, కుటుంబ అవసరాలను గుర్తించిన ఎంజి ఎన్‌ఆర్‌ఇజిఎస్, గ్రామ సచివాలయాలు, మండల పరిషత్, రెవెన్యూ ఉద్యోగులు రూ.95 వేలు సేకరించారు. విషయం తెలుసుకున్న నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు రూ.5 వేలు వ్యక్తిగతంగా విరాళం అందించారు. మొత్తం లక్ష రూపాయలను వీర వెంకట సత్యనారాయణకు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులూ స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయమన్నారు. ఆయన వెంట నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ కె.రాజ్ కిషోర్, ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి, ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్ పాల్గొన్నారు.

అడవిపాలెంలో ఉపాధి పనులు పునఃపారంభం

యలమంచిలి:అడవిపాలెంలో ఉపాధి హామీ పనులు పున్ణ ప్రారంభమయ్యాయి. ఈ మేరకు మంగళవారం గ్రామంలో అధికారులు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఉపాధి హామీ గ్రామసభలో ప్రకటించారు. మండలాలు ఏర్పడినప్పటి నుండి యలమంచిలి మండల పరిధిలోని అడవిపాలెం గ్రామం కొన్ని సంవత్సరాలుగా పాలకొల్లు మున్సిపాల్టీలో విలీనం అవుతుందనే సందిగ్ధంలో ఆ గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయి. అయితే జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చొరవతో ఆ గ్రామంలో అధికారులు గ్రామ సభను నిర్వహించి ఉపాధి పనులు ప్రారంభమయ్యాయని ప్రకటించడంతోపాటు కొత్త వారికి ఉపాధి హామీ జాబ్ కార్డులు సైతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రేమాన్విత, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు మామిడిశెట్టి పెద్దిరాజు, ముచ్చర్ల శ్రీనివాస్, కూటమి నాయకులు కడలి గోపాలరావు, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, రుద్రరాజు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.



ఎంఎల్సి గోపీమూర్తితో ఉపాధ్యాయులు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎంఎల్సి గోపీమూర్తి కృతజ్ఞతా పర్యటన

నరసాపురం:టీచర్ ఎంఎల్సి బి.గోపీమూర్తి ఎంఎల్సిగా గెలిచిన సందర్భంగా కృతజ్ఞతా పర్యటనలో భాగంగా మంగళవారం మండలంలోని ఎల్‌బి.చర్ల, కాపులకోడప, దర్బరేవు, యర్రంశెట్టివారి పాలెం తదితర ఉన్నత పాఠశాలలను సందర్శించారు. తనను గెలిపించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ, శ్రామిక సమస్యలపై శాసనమండలిలో తన వాణి వినిపించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎం.మార్కండేయులు, ఆర్ఆర్ కె.రాజు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.అజయ్‌కుమార్, గౌరవాధ్యక్షులు పి.శ్యాంసన్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలి

డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్

తాడేపల్లిగూడెం:ప్రతి ఇంటి నుంచీ తడి, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించే అలవాటు చేయాలని డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్ సూచించారు. మండలంలోని పట్టెంపాలెంలో మంగళవారం సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై ఇంటింటికీ వెళ్లి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్ మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం ద్వారా తడి చెత్తను కంపోస్ట్ చేసి, పొడి చెత్తను విడదీసి సంపద సృష్టించవచ్చని సూచించారు. కార్యదర్శి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

భీమవరం టౌన్: అనాకోడేరు డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ప్రత్యేకతలను, ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను తెలియజేసే పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ రూపొందించింది. ఈ పోస్టర్‌ను పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ సుంకర పరమేశ్వరరావు గ్రామంలోని వివిధ పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల విద్యాబోధనను, సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం రేపాక వెంకన్న బాబు మాట్లాడారు. అనంతరం ఆరవ తరగతిలో ప్రవేశం కోసం వచ్చిన విద్యార్థులకు 'సమ్మర్ జాయ్ మెటీరియల్' అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు జి.నర్మద, ఎన్.దుర్గా వరప్రసాద్, ఎంవి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెట్లు పెంచి కాలుష్యాన్ని నివారించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సమస్త ప్రాణికోటికి ఆధారం భూమాత అని, చెట్లను పెంచి కాలుష్యాన్ని నివారించాలని ఆర్‌టిసి డిపో మేనేజర్ పి.సత్యనారాయణ మూర్తి అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక సెయింట్ మేరిస్ హాస్పటల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించి మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలను నాటి ప్రతిజ్ఞ నిర్వహించారు. డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మొక్కలను పెంచకపోతే భావితరాల్లో ప్రాణకోటికి ముప్పువాటిల్లుతుందన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సిస్టర్ రెజ్జి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సిస్టర్ ప్లావిలా, సిస్టర్ అనిత్, యలమంచిలి శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆకివీడు : మనభూమిని మనమే కాపాడుకోవాలని లేనిపక్షంలో మానవుడు మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఏర్పడుతుందని ఎస్ఐ ఆందోళన వ్యక్తం చేశారు. అజ్జమూరు గురువు ప్రాథమిక పాఠశాలలో ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరవింద్ నారాయణ విక్రమ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ మజ్జి రాజేశ్వరి, పోలీస్ సిబ్బంది సురేష్, రాణి, పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి రూ.లక్ష సాయం

భీమవరం:బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ముదేళ్ల బాబుకు సహకారం అందించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ముదేళ్ల బాబుకు భీమవరానికి చెందిన దాతలు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ఎంఎల్ఎ చేతులమీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. భీమవరం 27వ వార్డుకు చెందిన కాసార్ల దుర్గాప్రసాద్ ముదేళ్ల కుమారుడు వేహాంత్ అర్జున్ బ్లడ్ క్యాన్సర్‌తో విజయవాడ రెయిన్ బో హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. డిఎన్ఆర్ కళాశాలకు చెందిన రాజ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంటా రామకుమార్ రూ.50 వేలు, డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు జి.పాల్‌సాల్స్, జి.దీపక్, ఇ.సంజయ్ బాబు, జె.ఆంజనేయ ప్రసాద్, బి.ఫణీంద్ర రూ.50 వేలు మొత్తం రూ.లక్ష అందించారు. దాతలను ఎంఎల్ఎ అభినందించారు. కార్యక్రమంలో బ్యాంక్ బాబీ, పాలపర్తి సాగర్, లంకి సిని పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



మాట్లాడుతున్న 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

మే 10వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయడానికి ప్రయత్నం చేయాలని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా మంగళవారం జరిగిన పోలీసు అధికారుల సమావేశంలో సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులను కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడానికి తగిన సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.అరుంధతి, సిఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

టిడిపి నూతన కార్యవర్గం ఎన్నిక

మొగల్తూరు:పార్టీ అభ్యున్నతికి నూతన కార్యవర్గం శక్తివంచన లేకుండా కృషి చేయాలని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు సూచించారు. మొగల్తూరులోని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. టిడిపి మొగల్తూరు అధ్యక్షునిగా బొల్లా నారాయణ విఠల్ (చంటి), ఉపాధ్యక్షుడిగా పొన్నపల్లి శివ, కార్యదర్శిగా పితాని రాజు, పలువురు సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడారు. పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు చంటి మాట్లాడుతూ పార్టీలో ప్రతి ఒక్కరినీ కలుపుకుని అభివృద్ధికి పని చేస్తానని తెలిపారు. నాయకులు మామిడిశెట్టి సత్యనారాయణ, పాల రాంబాబు, కలిదిండి కుమార్, పాల రాంబాబు కొల్లాటి భోగరాజు, పంపన భగవాన్, గుండు రాజా, శ్రీను, బల్ల శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

24న విద్యుత్ సరఫరా నిలిపివేత

గణపవరం:ఈ నెల 24న పిప్పర సబ్ స్టేషన్ పరిధిలోని కేశవరం, పిప్పర, జల్లికాకినాడ, అప్పన్నపేట, ముప్పర్తిపాడు, మొయ్యేరు, డి.కుముదవల్లి, కోమర్రు, ఎ.గోపవరం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహామూర్తి మంగళవారం తెలిపారు. ఈ గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ నిలివేస్తున్నట్లు చెప్పారు.

దారి తప్పుతున్న యువత..!

టుటౌన్‌లోని ఓ లాడ్జిలో 18 మంది విద్యార్థులు - ప్రయివేట్ హాస్టళ్లపై అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఒకపక్క కుటుంబ పోషణ భారమైనప్పటికీ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, తోటి పిల్లల కంటే గొప్పగా చూసుకోవాలని తల్లిదండ్రులు ఆశపడుతుంటారు. ఎంతో కష్టపడి, అప్పులు చేసి మరీ లక్షలు ఖర్చు చేసి కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిస్తున్నారు. అయితే అవేమీ పట్టని కొంతమంది యువతీ యువకులు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. హాస్టల్లో ఉంటున్న యువత లాడ్జీల చుట్టూ తిరుగుతూ వారి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భీమవరంలో గుర్తింపు పొందిన కాలేజీలు ఉన్నాయి. దీంతో తమ పిల్లలను ఇక్కడ చదివిస్తే బాగుంటుందని తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఫీజులు కట్టి చదివిస్తున్నారు. భీమవరంలోని ప్రయివేటు హాస్టళ్లలో జాయిన్ చేస్తున్నారు. హాస్టల్లో ఉంటున్న కొంతమంది విద్యార్థులు లగ్జరీ లైఫ్ కోసం, ప్రేమ పేరుతో లాడ్జీలకు వెళ్తున్న పరిస్థితి. వన్‌టౌన్ చినపేటకు చెందిన ఐతం శ్రీనివాస్ శ్రీనిధి రెసిడెన్షియల్ లాడ్జి జువ్వలపాలెం రోడ్డులో నడుపుతున్నారు. అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో టూటౌన్ సిఐ కాళీచరణ్ ఆధ్వర్యంలో దాడి చేసి 9 మంది యువకులను, 9 మంది యువతులను మొత్తం 18 మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే వీరంతా విద్యార్థులు కావడంతో అంతా షాక్‌కు గురయ్యారు. వీరిలో ఇద్దరు యువతులు దిరుసుమర్రు రోడ్డులోని ప్రముఖ కళాశాలకు చెందిన విద్యార్థినులు అక్కడే హాస్టల్లో ఉంటున్నారు. గొల్లవానితిప్పరోడ్డులోని పేరొందిన కళాశాల హాస్టల్‌కు చెందిన విద్యార్థినులు కూడా పట్టుబడడం గమనార్హం. అలాగే రాజోలు, సఖినేటిపల్లి ప్రాంతాలకు చెందిన వారు, జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. చదువు పూర్తయినప్పటికీ తల్లిదండ్రులకు అదనపు క్లాసులు అంటూ మాయమాటలు చెప్పి బయట రూముల్లో ఉంటున్నట్లు తెలుస్తోంది. తనిఖీల్లో భాగంగా లాడ్జి రిజిస్టర్లో యువతీ యువకులు పలుమార్లు ఇక్కడకు వచ్చినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

ఇదే విషయమై సిఐను వివరణ కోరగా అందరూ విద్యార్థులు కావడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు అందరికీ ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కేసు నమోదు చేయకుండా వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి వారిని పంపించామని తెలిపారు. లాడ్జి యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

సిఐ కాళీచరణ్



లక్షలు ఖర్చు చేసి పిల్లలను తల్లిదండ్రులు చదివిస్తున్నారు. వారు ఎలా ఉంటున్నారో విద్యార్థులు చదివే కళాశాలకు ఫోన్లు చేసి తెలుసుకోవాలి. హాస్టల్లో ఉండే వారిపై మరింత జాగ్రత్త తీసుకోవాలి. చిన్న వయసులో తెలిసీ తెలియక చేసే తప్పుల కారణంగా భవిష్యత్తు నాశనమవుతోంది.

ప్రపంచానికే లెనిన్ మార్గదర్శి

తణుకు:సోషలిజం ఒక్కటే ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకూ ప్రత్యామ్నాయమని, ఆచరణలో నిరూపంచి లెనిన్ ప్రపంచానికే మార్గదర్శి అయ్యారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ అన్నారు. మంగళవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా లెనిన్ 155వ జయంతిని నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి మాట్లాడుతూ ప్రపంచంలో మొదటి సారి విప్లవం విజయవంతం చేసి, దోపిడీ లేని శ్రామిక రాజ్యం లెనిన్ రష్యాలో స్థాపించారన్నారు. సోషలిస్ట్ దేశాలు ఒక్కటే అమెరికా విధానాలపై నికరమైన పోరాటం చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే కమ్యూనిస్టుల ప్రాధాన్యత ఏంటో ప్రజలకు అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో గార రంగారావు, గుబ్బల గోపి, ఉషా, పిడి.మూర్తి పాల్గొన్నారు.

భీమవరం :శ్రమ దోపిడీ, ఆర్థిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా విప్లవోద్యమాన్ని నిర్మించి రష్యాలో తొలి శ్రామిక రాజ్యాన్ని నెలకొల్పిన గొప్ప సోషలిస్టు విప్లవకారుడు లెనిన్ ఆశయ సాధనకు అందరూ పునరంకితం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. లెనిన్ జయంతి సందర్భంగా మంగళవారం భీమవరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించి లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



తణుకు : లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

గర్భిణులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా పుట్టే విధంగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి.సూర్యకుమారి అన్నారు. కొడమంచిలి అంగన్వాడీ సెక్టార్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పోషణ పక్వాడాపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూర్య కుమారి మాట్లాడుతూ పిల్లల్లో పౌష్టికాహారం లోపం లేకుండా తొలి వెయ్యి రోజుల సంరక్షణ అత్యంత కీలకమన్నారు. బాలింతలు తమ బిడ్డకు పాలు ఇచ్చినప్పుడే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం బండి వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్త పిబె.కుమారి, మైలే విజయలక్ష్మి, పి.నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, సుజాత, గౌరీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం :గొల్లలకోడేరు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడారు. ఎక్కువగా ఫోన్, టీవీలు చూడడం, పిల్లలకు కూడా అవే చూపించడం వల్ల వారికి శారీరక వ్యాయామం తగినంత ఉండడం లేదన్నారు. ఆటలు, శారీరక వ్యాయామం చేయడం వంటి వాటి పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఆయుష్ డాక్టర్ శ్రీరామ్ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, అనంతలక్ష్మి, సీతామహాలక్ష్మి, రూత్ మేరీ పాల్గొన్నారు.



యలమంచిలి : మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

యలమంచిలి : పాలకొల్లు ప్రాజెక్టు యలమంచిలి మండలం దొడ్డిపట్ల సెక్టార్ పరిధిలోని ఇరపకుర్రు పంచాయతీ కోడ్ నంబర్ 195 అంగన్వాడీ కేంద్రం వద్ద మంగళవారం 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎస్ఎన్.మల్లీశ్వరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆహార నియమాలు పాటించాలన్నారు. ఎఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గణపవరం : ఐసిడిఎస్ పిప్పర సెక్టార్ ఆధ్వర్యంలో మంగళవారం కాశిపాడులో పోషన్ పక్వాడీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌హెచ్ పి.ఎ.రమ్యశ్రీ, పిప్పర సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్ దుర్గాభవాని మాట్లాడారు. కార్యక్రమంలో గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : అంగన్వాడీ పోషణ పక్షోత్సవాల చివరి రోజు సందర్భంగా పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి బ్రాహ్మణచెరువు సెంటర్ వరకూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సామ్యూల్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 యు.నాగేశ్వర రావు, సిడిపిఒ అంగర కృష్ణకుమారి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాళ్ల : చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిడిపిఒ నిర్మల అన్నారు. ఏలూరుపాడులో ఐదు అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆకివీడు ఐసిడిఎస్ సిడిపిఒ నిర్మల మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యార్థికి సైకిల్ అందజేత

తణుకు:తణుకు మానవత ఆధ్వర్యంలో ఎస్‌సిఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి.శ్రీనివాస్‌కు హైదరాబాద్‌కు చెందిన భూపతిరాజు పెద్దిరాజు వారి తల్లి కృష్ణవేణి పేరిట రూ.7 వేల విలువైన సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా తణుకు మండల అధ్యక్షురాలు కటారి శారదాదేవి మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా పొడగట్లపల్లి నుండి ఈతకోట వరకూ విద్యార్థి సౌకర్యార్థం ఈ సైకిల్ దాతలు బహూకరించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ కమిటీ ఛైర్మన్ గమిని రాంబాబు, రాష్ట్ర విస్తరణ, అభివృద్ధి కమిటీ కన్వీనర్ కోడూరి రాధా పుష్పావతి పాల్గొన్నారు.



బడికి పోతా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కొడమంచిలిలో 'నేను బడికి పోతా'

ఆచంట:ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు తమ వంతు కృషి చేస్తామని ఎంఇఒ-2 పి.రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం కొడమంచిలిలో నేను బడికి పోతా కార్యక్రమంపై ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆ పాఠశాలలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బడి బయట పిల్లలు లేని గ్రామంగా తీర్చిదిద్దడమే బడికి పోతా కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. స్టూడెంట్ కిట్టు ఇతర విద్యా ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. నూతనంగా బడిలో చేరిన పిల్లల సామర్థ్యాలు, వయసుకు తగిన తరగతుల్లో చేర్చి ఆ తరగతి స్థాయిని అందుకునేందుకు బ్రిడ్జి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.కాశీ, ఎ.శ్రీనివాస్, చంద్రశేఖర్, సుదర్శన్, శాస్త్రి పాల్గొన్నారు.

బాధితునికి సిఎం సహాయ నిధి అందజేత

తణుకు:సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్న బాధితులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం కార్యాలయంలో తణుకుకు చెందిన తుపాకుల శ్రీనివాస్‌కు సిఎం సహాయ నిధి నుండి రూ.10 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల తణుకు పర్యటన సందర్భంగా బాధితుడు శ్రీనివాస్ కలిసి తన పరిస్థితిని చెప్పడంతో స్పందించిన సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా చెక్కును అందజేసిన ఎంఎల్ఎ రాధాకృష్ణకు బాధితుడు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

హైస్కూల్‌కు వాటర్ కూలింగ్ ఫ్రీజర్ అందజేత



గణేశ్న పెద వెంకటరత్నంను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాళ్ల:తోట వెంకయ్య సత్యవతమ్మ హైస్కూల్ విద్యార్థులకు రిటైర్డ్ తహశీల్దార్ గణేశ్న పెద వెంకటరత్నం వాటర్ కూలింగ్ ఫ్రీజర్ బహూకరించడం అభినందనీయమని మాజీ సర్పంచి కట్రేడ్డి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిసలిలో తోట వెంకయ్య సత్యవతమ్మ హైస్కూల్లో గణేశ్న సరస్వతి జ్ఞాపకార్థం ఆమె భర్త రిటైర్డ్ తహశీల్దార్ గణేశ్న పెద వెంకటరత్నం రూ.1.20 లక్షల విలువైన వాటర్ కూలింగ్ ఫ్రీజర్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, హైస్కూల్ ఉపాధ్యాయులు దాత వెంకటరత్నాన్ని అభినందించారు. కార్యక్రమంలో జనసేన గ్రామ అధ్యక్షుడు నూకల భోగేంద్రబాబు, గణేశ్న నల్ల శ్రీను, గణేశ్న పద్మారావు, సూర్యనారాయణ, శివాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీతంలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన ఆంగ్ల ఉపాధ్యాయిని చెల్లుబోయిన పద్మను సత్కరించారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

పాలకొల్లు రూరల్:పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పాలకొల్లు, మొగల్తూరు, నరసాపురం, పోడూరు, యలమంచిలి మండలాలకు సంబంధించిన గ్రేడ్ వన్ నుండి 5 వరకూ పంచాయతీ కార్యదర్శులతో నరసాపురం డివిజనల్ అధికారి జ్యోతిర్మయి సమీక్షించారు. ఈ సమావేశానికి పాలకొల్లు మండల డిప్యూటీ ఎంపిడిఒ మూర్తిబాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఇంటి పన్నులు, పనులకు సంబంధించి ఇతర అంశాలు, సమిత్వ అనే కార్యక్రమంలో భాగంగా వివిధ సర్వేలు నిర్వహించి గ్రామ కంటాలు, ఇళ్లకు పట్టాలు ఇచ్చే కార్యక్రమం కోసం పైలెట్ ప్రాజెక్టుగా దగ్గులూరును ఎంపిక చేశారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు ఏవిధంగా చేపట్టాలనే విషయంపై డివిజనల్ పంచాయతీ అధికారి వివరించారు.

పవిత్రపేటలో అన్నదానం

తాడేపల్లిగూడెం:సంస్కృతీ సాంప్రదాయాల పరిరక్షణకు యువత కృషి చేయాలని వైసిపి రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షులు వంటి రఘురాం నాయుడు సూచించారు. స్థానిక పవిత్ర పేటలో పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయం వద్ద వైసిపి రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షులు వడ్డీ రఘురాం నాయుడు సహకారంతో సావిత్రి పేట యూత్ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. శాఖాహార, మాంసాహార వంటకాలతో అన్నదానం చేశారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్ట్

తాడేపల్లిగూడెం:మండలంలోని పుల్లాయిగూడెంలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు దొరబాబు, మురళీమోహన్, సిబ్బందితో కలిసి వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

ఉండి:చెరుకువాడలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వెంకటేశ్వరావును ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఆకివీడు ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇటీవల బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పెరిగిపోయాయని తెలిపారు. తమకు సమాచారం రాగానే దాడులు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కరుణప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు రూరల్ : తణుకు పట్టణ పరిధిలో అజ్జరం రోడ్డులో కిళ్లీ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఆదుర్తి సాయిబాబు ను మంగళవారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఐదు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ఎక్సైజ్ సిఐ ఎస్. మణికంఠ రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ బి.లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

డిఎస్‌పి జయసూర్యకు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్రస్థాయిలో ఎబిసిడి అవార్డు సాధించిన డిఎస్‌పి ఆర్.జయసూర్యను శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంగళవారం సత్కరించారు. వృత్తి ధర్మాన్ని పాటించడంలో చిత్తశుద్ధి ఉంటే గుర్తింపు అదే వస్తుందని డిఎస్‌పి తెలిపారు. జిల్లా ఎస్‌పి నుంచి కానిస్టేబుల్స్ వరకూ ఐదు రోజులపాటు కష్టపడి కేసును చేధించామని, కేసు చెందిన పోలీసు శాఖ వారికి అవార్డులు రావడం ఆనందదాయకమని అన్నారు. ఇటీవల సూటు కేస్‌లో డెడ్ బాడీ కేసును చేధించిన జిల్లా పోలీస్ శాఖ రాష్ట్రస్థాయిలో ఎబిసిడి అవార్డును అందించిందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, అరేటి ప్రకాష్ తెలిపారు. దీనిలో భాగంగా డిఎస్‌పిని సత్కరించామన్నారు.

ఎఎస్ఎన్ఎంలో ముగిసిన ఆధార్ క్యాంప్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ స్వయం ప్రతిపత్తి కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం, పోస్టల్ డిపార్ట్మెంట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో పాలకొల్లు పరిసర ప్రాంత ప్రజలకు ఆధార్ నమోదు, తప్పులు సరిచేసుకునే శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ తిరువీధుల రాజరాజేశ్వరి అధ్యక్షతన కళాశాలలో ఇటువంటి శిబిరం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని పలువురు చెప్పారు. కార్యక్రమంలో ప్రాంతీయ పోస్టల్ సిబ్బంది, అధ్యాపకులు వి.విజయలక్ష్మి, కె.పార్థసారథి పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

కైకరం శివారు రామన్నగూడెం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా గ్రామస్థుడు సైదు వెంకట రాజు S/o. పోతురాజు అను నేను తెలియజేయునది.

భీమడోలు మండలం పూళ్ళ గ్రామ రెవెన్యూ లోని డాక్యుమెంట్ నెంబరు: 2194/2004 మరియు లింక్ డాక్యుమెంట్లు జిరాక్స్ తీసుకొనుటకు వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి.కావున దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలుపగలరు.

సైదు వెంకటరాజు
S/o. పోతురాజు
కైకరం శివారు రామన్నగూడెం,
ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా,
ఫోన్: 99512 73831

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కైకలూరు వారి కోర్టులో
ఎస్.సి.ఓ.పి.నెం. 2/2025

బిట్వీన్:-
గద్దె రత్న కుమారి ...పిటీషనర్
మరియు
నిల్ ...రెస్పాండెంట్స్

పై నెంబరు లో మరణించిన మైనర్ గద్దె మహితను పిటీషనర్ మరియు ఆమె భర్త గద్దె పాపారావు దత్తత తీసుకునియున్నారు. ఆమె భర్త గద్దె పాపారావు మరణించియున్నారు. గద్దె మహిత పాము కాటుతో మరణించినందున ఎల్.ఐ.సి క్లయిమ్ కొరకు సక్సెషన్ సర్టిఫికెట్ కోరుతూ పై నెంబరు పిటీషన్ ను పిటీషనర్ దాఖలు చేసియున్నది. మరణించిన గద్దె మహితకు పిటీషనర్ గద్దె రత్నకుమారి తప్ప ఇంక ఎవరూ వారసులు లేరు. యిందుపై ఎవరికైనా అభ్యంతరము ఉన్న యెడల పై కోర్టు వారి యెదుట **ది. 05-05-2025వ సం. తేదిన ఉదయం గం.10-30 ని.లకు** స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని వచ్చి తెలుపుకొనవచ్చును. లేని యెడల పరోక్షముగా అనగా ఎవరికి అభ్యంతరములు లేవని పిటీషనర్‌కు సక్సెషన్ సర్టిఫికెట్ ఇచ్చుటకు శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా: 05-05-2025

వడ్లాని శ్రీరామచంద్రమూర్తి
కైకలూరు పిటీషనర్ తరపు న్యాయవాది,
ది.22-04-2025 కైకలూరు-521333
సెల్: 94407 21746

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 1249/2019 ఇన్
ఓ.యస్.నెం. 184/2018

బిట్వీన్:-
ఉమ్మిడి విజయలక్ష్మి ...వాది
మరియు
విస్సా శ్రీ అప్పాజీ వెంకట సత్యనారాయణ మరియు 10 మంది ఇతరులు ...ప్రతివాదులు

ప్రపోస్ట్ పార్టీలు:-

1. విస్సా వెంకట లక్ష్మి, W/o. లేట్ సత్యనారాయణ మూర్తి, కుమారుల ఆధీనం, చిట్టవరం, నర్సాపురం మండలం.
2. విస్సా వెంకటేష్ బాబు, S/o. లేట్ సత్యనారాయణ మూర్తి, కుమారుల ఆధీనం, చిట్టవరం, నర్సాపురం మండలం.
3. మేడిది సీత మహాలక్ష్మి, W/o. నాగ వెంకట సత్య బలరామ క్రిష్ణ స్వామి నాయుడు, D/o. లేట్ సత్యనారాయణ మూర్తి, చిట్టవరం, నర్సాపురం మండలం.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు సమన్లు జారీ చేసినప్పటికి, మీరు ఉదేశపూర్వకంగా అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ద్వారా మీకు సమన్లు జారీ చేసియున్నారు. సదరు దావా **ది. 05-05-2025వ సం. తేదిన ఉదయం గం. 10-30 ని.లకు** వాయిదా అయివున్నది. కావున మీరు ప్రత్యక్షముగా గాని, లేదా మీ పరోక్షమున ప్లీడరు గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున ముందు గ్రంథము జరిపెదరని యిందుమూలముగా తెలియచేయడమైనది.

పి.డి.యస్.వి.బాలాజీ బి.కామ్, బి.యల్
పాలకొల్లు న్యాయవాది,
ది.22-04-2025 పాలకొల్లు
సెల్: 94904 33732

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 1248/2019 ఇన్
ఓ.యస్.నెం. 184/2018

బిట్వీన్:-
ఉమ్మిడి విజయలక్ష్మి ...వాది
మరియు
విస్సా శ్రీ అప్పాజీ వెంకట సత్యనారాయణ మరియు 10 మంది ఇతరులు ...ప్రతివాదులు

ప్రపోస్ట్ పార్టీలు:-

1. విస్సా వెంకట లక్ష్మి, W/o. లేట్ సత్యనారాయణ మూర్తి, కుమారుల ఆధీనం, చిట్టవరం, నర్సాపురం మండలం.
2. విస్సా వెంకటేష్ బాబు, S/o. లేట్ సత్యనారాయణ మూర్తి, కుమారుల ఆధీనం, చిట్టవరం, నర్సాపురం మండలం.
3. మేడిది సీత మహాలక్ష్మి, W/o. నాగ వెంకట సత్య బలరామ క్రిష్ణ స్వామి నాయుడు, D/o. లేట్ సత్యనారాయణ మూర్తి, చిట్టవరం, నర్సాపురం మండలం.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు సమన్లు జారీ చేసినప్పటికి, మీరు ఉదేశపూర్వకంగా అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ద్వారా మీకు సమన్లు జారీ చేసియున్నారు. సదరు దావా **ది. 05-05-2025వ సం. తేదిన ఉదయం గం. 10-30 ని.లకు** వాయిదా అయివున్నది. కావున మీరు ప్రత్యక్షముగా గాని, లేదా మీ పరోక్షమున ప్లీడరు గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున ముందు గ్రంథము జరిపెదరని యిందుమూలముగా తెలియచేయడమైనది.

పి.డి.యస్.వి.బాలాజీ బి.కామ్, బి.యల్
పాలకొల్లు న్యాయవాది,
ది.22-04-2025 పాలకొల్లు
సెల్: 94904 33732

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. No. 624/2024 in
O.S. No. 226/2023

Between:
మేడపాటి రామ కృష్ణా రెడ్డి ...పిటీషనరు/వాది
And

1. గొట్టుముక్కల వెంకట సుబ్బారావు (died) ...రెస్పాండెంటు/ప్రతివాది
2. గొట్టుముక్కల రామ సీత
3. గొట్టుముక్కల వెంకట సత్య వర్మ
4. గొట్టుముక్కల కోదండ రామ రాజు ...రెస్పాండెంట్లు/ప్రొపోసేడ్ ప్రతివాదులు

To.
2nd. Respondent/2nd. Proposed Defendant:-
Gottumukkala Rama Seetha,
W/o.(late) Venkata Subba Raju, D.No. 27-17-79, 34thWard, A.S.R. Nagar, Bhimavaram, W.G.Dt.,
3rd. Respondent/3rd. Proposed Defendant:-
Gottumukkala Vekata Satya Varma,
S/o.(late) Venkata Subba Raju, D.No. 27-17-79, 34thWard, A.S.R. Nagar, Bhimavaram, W.G.Dt.,
4th. Respondent/4th. Proposed Defendant:-
Gottumukkala Kodanda Rama Raju,
S/o.(late) Venkata Subba Raju, D.No. 27-17-79, 34thWard, A.S.R. Nagar, Bhimavaram, W.G.Dt.,

పై నెంబరు పిటిషనులో 2 నుండి 4 రెస్పాండెంట్లను ప్రతివాదులుగా చేర్చమని కోరుచూ పిటిషనరు పిటిషన్ దాఖలు చేసినందున సదరు పిటిషన్ లో 2 నుండి 4 రెస్పాండెంట్లు హాజరు నిమిత్తం **ది. 08-05-2025వ సం. తేదికి** వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా కానీ, న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పిటిషను ముందు గ్రంథము జరుపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు న్యాయవాది,
ది.22-04-2025 పాలకొల్లు-ప॥గో॥జిల్లా